# ఏది మంచి కథ?

-డాక్టర్ ద్వా.నా. శాస్త్రి

ఏది మంచి కవిత? లేదా ఏది గొప్ప కవిత? ఏది మంచి కథ? లేదా ఏది గొప్ప కథ?

- ఇటువంటి ప్రశ్నలు ఎప్పుడూ ఉండేవే. శతాబ్దాలుగా వీటికి సమాధానాలు చెప్తూనే వున్నారు - చర్చిస్తూనే వున్నారు. ఇటీవల ఒక కథా సంకలనం వేసే ప్రయత్నంలో సంపాదకవర్గం అనేక కథలు చదివి- "గత సంవత్సరంలో మంచి కథలు పట్టుమని పది-పదిహేను కంటె మించి రాలేదు" అన్నారు. ఇది కొంత చర్చకి దారితీసింది. చాలామంది గత ఇరవై సంవత్సరాలుగా కథా సాహిత్యం దినదినాభివృద్ధి చెందుతోందనీ, ఎంత వైవిధ్యంతో సహజత్వంతో (నేటివిటీతో) వికాసం చెందుతోందనీ అనుకొంటున్న తరుణంలో పై వ్యాఖ్య దిగులు కలిగించేదిగా వుంది. ఇది నిజమేనా? మంచి కథలు రావటంలేదా?

"ఇది మంచి కథ" అని ఎలా చెప్పగలం? ఎవరు చెప్పగలరు? విమర్శకులైతే మంచి కథకి గల కొన్ని సూత్రాలనుబట్టి మంచి కథగా నిర్ణయిస్తారు-

- వస్తు వైవిధ్యం ఉండాలి
- శైలీనవ్యత
- పాత్ర పోషణ
- సంభాషణా నైపుణ్యం
- మలుపు-కొసమెరుపు (ముగింపు)
- వర్ణనాచాతుర్యం

వీటి ఆధారంగా కథను విశ్లేషించి ఉత్తమ కథ, మామూలు కథ, ఉత్త కథ... అంటూ విభాగాలు చేస్తారు.

డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి "కథానిక - స్వరూప స్వభావాలు" అనే సిద్ధాంత గ్రంథంలో ఉత్తమ కథను కొందరు త్రిమితీయ విశ్లేషణ (Three-dimensional)గా నిర్ణయిస్తారంటూ ఇలా చెప్పారు - వస్తుగత విభాగం, రూపగత విభాగం, సంవిధాన విభాగం. ఆయనే మంచి కథకి ఇచ్చిన నిర్వచనం ఇది- "జీవితంలోని ఒకానొక మహత్తర సత్యాన్ని అద్భుత శిల్ప నైపుణ్యంతో కళ్ళకు కట్టించి, హృదయాన్ని ఒకానొక మహత్తరమైన అనుభూతితో నిండించి పదే పదే చదవాలనిపించే కథను గొప్ప కథ అనవచ్చు."

మరి కథా రచయిత, విద్యావేత్త, సంపాదకులు అయిన కీ.శే. వాకాటి పాండురంగారావు ఏమన్నారో చూడండి- "ఒక కథ చదివిన తర్వాత మనసు చలించాలి. మళ్ళీ చదివింపజెయ్యాలి. ఈ కథ బాగుంది అని పది మందికీ చెప్పించగలగాలి. మరో పదేళ్ళో ఇరవై ఏళ్ళో పోయింతర్వాత చదివినా అనుభూతి, స్పందన కలగాలి. అప్పుడే అది గొప్ప కథ అవుతుంది."

"వస్తువు స్వీకరించడం- ఊహలో వ్యక్తుల రూప కల్పన చేయడం ఒకెత్తూ, వ్రాసేటప్పుడు కళానుగుణమైన ఆవేశానికి లొంగిపోయి కళానుగుణమైన సత్యాన్ని ప్రదర్శించడం ఒకెత్తూ. ఆ సత్యం కథకుణ్ణి చకితుణి చేస్తుంది. తన లోపలి చీకటి తెరలు తొలగినట్లవుతుంది. ఒక్క క్షణం వూపిరి బిగబట్టి ఒక వెలుగు చూస్తాడు. ఆ క్షణం ఆధ్యాత్మికానుభూతి పొందుతాడు. అట్లా పొంది అందులో కాస్తో కూస్తో పాఠకుడితో పంచుకోగలిగితే అతని కథ గొప్ప కథ అవుతుందనుకుంటాను"- అన్నారు గొప్ప కథా రచయితగా పేరు పొందిన బుచ్చిబాబు మాట!

నిజానికి మంచి కథకి వీళ్ళు చెప్పినవన్నీ సార్వకాలికమైన సత్యాలు కానేకావు. వీళ్ళు కూడా "గొప్ప కథ అనవచ్చు", "ఒకానొక", "అవుతుందనుకుంటాను" అన్నారే తప్ప నిర్దిష్టంగా స్పష్టం చెయ్యలేదు. వాకాటి గారు మరో పదేళ్ళో ఇరవై ఏళ్ళో పోయింతర్వాత చదివినా అనుభూతి, స్పందన కలగాలి" అనటమూ నేటి మంచి కథకి వర్తించదు. ఒకప్పటి సార్వకాలికం, సార్వజనీనం అనే లక్షణాలు నేటి సాహిత్యానికి వర్తించవు. ఉద్యమాలు గానీ, ప్రాంతీయతలు కానీ, నేటి జీవిత సమస్యలు గానీ - సార్వకాలికంగా ఉండటానికి వీలులేదు. సమకాలీన సమస్యలు, నేటి జీవన విధానంలోని చిక్కులపై మంచి కథలు వస్తున్నాయి. మరో పదేళ్ళు లేదా ఇరవై ఏళ్ళు తర్వాత ఈ కథల్ని చదివితే ఇదే అనుభూతి లేదా స్పందన కలగాలని ఏమీలేదు. తాత్కాలిక సమస్యతో తాత్కాలికమైన ప్రయోజనంతో స్పందించేలా రాయబడినా అది ఇవాళ మంచి కథే అవుతుంది.

అందుకే 'ఇది మంచి కథ, ఇది గొప్ప కథ' అని నిర్ధారించటం కష్టం. ఒకరికి మంచి అనిపించింది మరొకరికి కాకపోవచ్చు. ఈ "మంచి" లేదా "గొప్ప"

అనేది తులనాత్మకంగానే వుంటుంది. లేదా "రెలిటివ్"గా (సాపేక్షంగా) వుంటుంది. ఒకనాటి గొప్ప కథలన్నవి నేడు చదివితే- ఏదో లోపం వుందనిపిస్తాయి. అందుకే "మంచి"ని నిర్ణయించేటప్పుడు - కాలం, సామాజిక స్థితి, రాజకీయ పరిణామాలు... కూడా పాత్ర వహిస్తాయి.

"మంచి కథలు రావటంలేదు - మాకు కనిపించడంలేదు" అని అంటున్నారంటే... వాళ్ళకి నచ్చిన రీతిగా రావడం లేదని అర్థం. కథల్ని ఎన్నిక చేసే నిర్ణేతల వ్యక్తిగత అభిరుచులకి అనుగుణంగా లేవని పిండితార్థం. తన భావజాలానికి వ్యతిరేకంగానో లేదా తను అనుకొన్న శిల్పం లేకపోతేనో మంచి కథ కాదనుకోవచ్చు. ఆ అభిప్రాయాన్ని అందరిమీదా బలవంతంగా రుద్దకూడదు. నిజానికి పైన చెప్పిన నిర్ణేతల అభిప్రాయం ప్రకారం తెలుగు కథ గొప్ప స్థితిలో లేదని తెలుస్తుంది కానీ - అంత విమర్శ సబబు కాదు.

మంచి కథకి ఏదిముఖ్యం? వస్తువా? శిల్పమా? - ఇదీ అసలైన చర్చనీయాంశం. కొందరు వస్తువే ముఖ్యమంటారు, ఇంకొందరు శిల్పం అంటారు. రెండూ వుంటేనే మంచి కథ అవుతుందంటారు మరి కొందరు. ఇవాళ శిల్పం కంటె వస్తువే ముఖ్యమన్న సంగతి గుర్తుంచుకోవాలి. శిల్పం అనగానే కవితా రీతులు తప్పవు. కథ కవిత్వం కాదని వేరే చెప్పక్కర్లేదు. కథా రచన ఉద్దేశం కేవలం ఆనందం - రసానందం - అందం కాదు.

మనిషిని స్పందింపజెయ్యడం, జీవితంపై అవగాహన కలిగించడం, జీవించే ధైర్యాన్ని ఇవ్వడం- మనం ఏమిటో మనకి తెలియజెయ్యడం... ఇవీ కథ వల్ల ప్రయోజనాలు. శిల్ప ప్రాధాన్యత వల్ల ఇవన్నీ దెబ్బతింటాయి. కథకి చదివించే గుణమే ప్రధానం. కాస్త ఆలోచింపజేస్తే చాలు మంచి కథే. జీవిత వాస్తవికత గలది మంచి కథ. మన సమాజంలోని చీకటి కోణాల్ని చూపిస్తే- మంచి కథ అవుతుంది. కవిత్వమే సరళీకృతం అవుతున్న రోజుల్లో కథకి శిల్పం వుండాలనటం అప్రజాస్వామికమే. 'శిల్పం' అనేది కథా రచయిత ఇష్టం. సాహితీ విమర్శకుడు చెప్పే శిల్పం వేరు.

ఏ కథా రచయిత అయినా కథ రాసేటప్పుడు "శిల్పము అనగా" అనుకుంటూ రాయడనే అనుకుంటాను. అంటే శిల్ప దృష్టి సమంజసం కాదనికాదు- దానిపైనే అమితశ్రద్ధ అటు విమర్శకుడికి గానీ, ఇటు రచయితకి గానీ - లేదా సంపాదకవర్గానికి గానీ కూడదు అనటమే. హృదయాన్ని ఆకట్టుకొనేది, చదవకముందు కంటే చదివిన తర్వాత అనుభూతిని లేదా ఆలోచనను కలిగించేది మంచి కథ అని "అనవచ్చు" గదా! ■

## రామమయం!

**రా**మనామం
మది తడితే చాలు
బాపుగీత!
రామకోటి
తలపుకొస్తే చాలు
పాపికొండలు!
రామాలయంలో
గంట మ్రోగితే చాలు
గోదారి లయలు!!

## నవ్వు!

**చి**రునవ్వు
ఇంట్లో వుంచేసి
ఆఫీసు కొస్తాడొకడు!
ఇంట్లో నవ్వితే
శ్రీమతి బంగరు కోరికలని
ఆఫీసులో వుంచేసి వస్తాడొకడు!

## మాతృత్వం!

**అ**మ్మ పొత్తిళ్ళ నుంచి / జారిపోయేక
మమత ఖరీదు తెల్సింది!
పల్లె నుంచి / వలస పోయేక
పర్యావరణ మూల్యం గమనించేను!
రాష్ట్రం / విడిచిపోయేక
తెలుగు తల్లి నుడికారం తెల్సింది!
దేశం నుంచి విశ్వప్రయాణంలో
భారతీయం అర్థమైంది!

## ఆనందబాష్పం

**క**న్నీటి ప్రవాహం అమ్మ
స్వేదజలం నాన్న
అందుకే కాబోలు నేను
వాళ్ళకు ఆనందబాష్పాన్ని!!

-శైలూషి